


## సేవే పరమార్థం.. కార్యసాధనే లక్ష్యం

- అంకితభావానికి నిలువెత్తు రూపం డాక్టర్ మజ్జి బాలకృష్ణ
- పశుసంవర్ధక శాఖలో జేడీగా రాణింపు
- అంచెలంచెలుగా ఎదిగి రైతులకు సేవలు
- సమర్థతతకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు
- రిటైర్డ్ అనంతరం పంటల సాగుపై ప్రత్యేక దృష్టి


# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 176
పేజీలు : 08 | వెల: రూ.5/-

గురువారం
ఏప్రిల్ 10, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





## దివ్యాంగ చిన్నారులతో ఎంపీ జన్మదిన వేడుకలు


స్వీట్లు తినిపించిన డాక్టర్ కడియం కావ్య




## దేశంలోనే అతి పెద్ద సభ

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- రజతోత్సవ ఏర్పాట్ల పరిశీలన

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

8లో..

## వాహనాలను తీసుకెళ్లండి



పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ఘటనల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అప్పగించడానికి నిర్ణయించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను హనుమకొండ, భీమారం, సీఆర్ పీఎఫ్ కేంద్రాల్లో భద్రపర్చామన్నారు. వాటిని పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి సబంధిత వాహన యజమానులకు నోటీసులు కూడా పంపామన్నారు. తగిన ఆధారాలతో వచ్చిన యజమానులకు వాహనాలను తిరిగి అంద జేయనున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్లు 8712685143, 8712685158, 8712584557 లో వాహన యజమానులు సంప్రదించాలని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు. – వరంగల్ వాయిస్, క్రైం



# మీరు ఓకే.. మా సంగతేంటి ?

- జోడు పదవులు మీకు..
- పనీ, పాట లేకుండా మేము
- నాయినిపై కార్యకర్తల రుసరుసలు
- పుష్కర కాలంగా మీకు, పార్టీకి సేవలు చేశాం
- పదవులు లేవ్.. పైసల్ రావ్
- అధ్వానంగా మారుతున్న పార్టీ శ్రేణుల బతుకులు

వివరాలు2లో..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై కార్యకర్తలు, పార్టీ శ్రేణులు కారాలు, మిరియాలు నూరుతున్నారు. పుష్కర కాలం మీకు, పార్టీకి సేవ చేస్తే నేడు మీరు గద్దె మీద కూర్చుంటే మా బతుకులు కుక్కలు చింపిన విస్తరిలా తయారయ్యారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా పార్టీ కోసం కష్టపడిన వారికి ఒక్కరికి కూడా నామినేటెడ్ పదవి దక్కింది లేదు..చిల్లి గవ్వ ఆదాయం వచ్చింది లేదంటూ మండిపడుతున్నారు. మమ్మల్ని సుద్దపూసల్లా ఉండాలంటూ నీతి వాఖ్యాలు చెబుతూ మీరు మాత్రం ప్రతి నెల రూ.2.50లక్షల జీతం, ఇతర అలవెన్సులతోపాటు నియోజకవర్గంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై పర్సంటేజీలు తీసుకుంటూ దర్జాగా కాలం గడుపుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీరు కష్టకాలంలో ఉన్నప్పుడు పాలు..నీళ్లలా మీవెంటే ఉంటూ ఎన్నో కష్టనష్టాలకోర్చిన వారిని సైతం గద్దెనెక్కగానే విస్మరించడంపై పెదవి విరుస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడైనా నాలుగు రాళ్లు సంపాదించుకోవద్దా అంటూ కార్యకర్తలు నిలదీస్తున్నారు. మీరు మాత్రం రెండు పదవులు వెలగబెడుతూ కార్యకర్తలకు ఒక్క పదవైనా ఇప్పించరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇదేనా మీ రాజనీతి అంటూ తూర్పార పడుతున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి



# మీరు ఓకే.. మా సంగతేంటి..?

- జోడు పదవులు మీకు..
- పనీ, పాట లేకుండా మేము
- నాయినిపై కార్యకర్తల రుసరుసలు
- పుష్కర కాలంగా మీకు, పార్టీకి సేవలు చేశాం
- పదవులు లేవ్.. పైసల్ రావ్
- అధ్వానంగా మారుతున్న పార్టీ శ్రేణుల బతుకులు


వరంగల్ వాయిస్, ఫైల్ ఫోటో

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై కార్యకర్తలు రుసరుసలాడుతున్నారు. మీరు చల్లగా ఉంటే చాలా.. మా సంగతేంటి అంటూ నిలదీస్తున్నారు. పుష్కర కాలంగా మీకు, పార్టీకి సేవ చేసినా మా బతుకుల్లో మాత్రం మార్పు రాలేదంటున్నారు. మీకు ఎమ్మెల్యే హోదా వచ్చింది. నెలనెల రూ.2.50 లక్షల జీతం వస్తోంది. ఇతర అలవెన్సులూ పొందుతున్నారు. వీటికితోడు వివిధ అభివృద్ధి పనుల్లో కమీషన్లు వస్తున్నాయి. ఇప్పుడు మీరు దర్జాగా జీవిస్తున్నారు. మమ్మల్ని మాత్రం భూతగాదాలు, పోలీస్ స్టేషన్లు, పంచాయతీలు, ఆదాయం వచ్చే పనులలో వేలు పెట్టొందంటూ నీతి వ్యాఖ్యలు చెబుతున్నారు. మరి మా కుటుంబాలు బతుకు దెరువు ఎట్లా అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడైనా నాలుగు రాళ్లు సంపాదించుకోవద్దా అంటూ కార్యకర్తలు నిలదీస్తున్నారు.

**అవకాశవాదులకు అందలం..**

పదవులు అడిగితే అర్హుల జాబితా అధిష్ఠానానికి ఇచ్చానంటూ నాయిని గత సంవత్సర కాలంగా చెప్పడం తప్ప ఏ ఒక్కరికీ న్యాయం చేసింది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నామినేటెడ్ పై ఆశలు పెట్టుకున్న వారికి పదవులు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. అయితే అసలు దారులను వదిలి.. అవకాశవాదులను అందలం ఎక్కించడంపై మండి పడుతున్నారు. ప్రతి నెల జీతం, అలవెన్స్ వచ్చే పదవిని జంప్ జిలానీకి కట్టబెట్టి చేతులు దులుపుకోవడంపై కాంగ్రెస్ కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్లలో సభలు, సమావేశాలు అంటూ నిజమైన పార్టీ శ్రేణుల జేబు గుల్లా చేస్తున్న నాయిని పదవుల విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఫోన్ చేస్తే స్పందన కరువు..**

పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీనియర్ కార్యకర్తలు ఫోన్ చేసినా నాయిని స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇలా అయితే పార్టీనే నమ్ముకున్న వారి పరిస్థితి ఏంటని నిలదీస్తున్నారు. నీతి వాఖ్యాలు చెబితే అవి కడుపు నింపవు కదా అంటున్నారు. నాయిని కొద్దిగా కష్టపడితే పలువురికి కార్పోరేషన్ లో కో–ఆప్షన్ సభ్యులుగా అవకాశాలు దక్కేవంటున్నారు. అదే విధంగా బల్దియాలో మెజార్టీ ఉన్నప్పటికీ డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం పెట్టి తమ పార్టీ నేతలకు ఇప్పించుకునేందుకు ఆయన పెద్దగా ఆసక్తి కనబర్చకపోవడంపై మండి పడుతున్నారు. వరంగల్ మహానగర అధ్యక్ష పదవిని పూర్తి చేసేందుకు కూడా నాయిని రాజేందర్ రెడ్డి మోకాలడ్డుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్ష పదవి బీసీ నేతకు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ కుట్రతో ఆ పదవి రాకుండా నాయిని అడ్డు తగులుతున్నాడని మండి పడుతున్నారు.

**చెప్పలరిగేలా తిరిగినా..**

ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్ రెడ్డి విజయం సాధించిన తర్వాత కార్యకర్తలను ఎవ్వరినీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. తన కోసం, పార్టీకోసం పనిచేసిన వారిని, నమ్ముకున్నోళ్లను నట్టేట ముంచుతున్నాడంటూ విమర్శిస్తున్నారు. హామీలిచ్చిన వారందరికీ వరుసగా వదవులు వస్తాయంటూ ఆశపెట్టి చెప్పులరిగేలా తిప్పుకుంటున్నారంటున్నారు. జోకుడుగాళ్లకు పెద్దపీట వేస్తూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని పక్కన బెడుతున్నారని మండిపడుతున్నారు. అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకొని అంతా తనే అన్నట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులు జాన్తానహి.. నా మాటే వేదం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పదవులు లేక, పైరవీలు లేక నిత్య ఖర్చులు కూడా వెళ్లడం కష్టంగా మారిందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు అప్పగించడంతోపాటు వారికి అండగా నిలువాల్సిన బాధ్యత ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిపై ఉందంటున్నారు.



## ఎంపీ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన పుట్టినరోజు వేడుకలను గురువారం మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జరుపుకున్నారు. కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగ చిన్నారులు డాక్టర్ కడియం కావ్యను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులను కడియం కావ్య ఆప్యాయంగా పలకరించారు. దివ్యాంగ చిన్నారులతో కొంత సమయం గడిపిన ఎంపీ వారి యోగక్షేమాలు, వారు ఏం చదువుతున్నారు, ఎందులో ప్రతిభ కలిగి ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించారు. ప్రతి ఏడాది తన పుట్టినరోజు వేడుకలను మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంటుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.





## గణపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

**వరంగల్ వాయిస్, గణపురం :** గణపురం మండల లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నం జగ్గారావు, ప్రధాన కార్యదర్శిగా కొవ్వూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా యాసం హరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా కోడగాని అనిల్, పోలు రాజేందర్, ఉప కార్యదర్శిగా కెక్కర్ల నరేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి లారీ ఓనర్లు శుభాకాంక్షలు తెలిపారు.

# ఐజేయూ సంబురాలు

**బల్దియా ఎదుట బాణసంచా పేల్చి, స్వీట్ల పంపిణీ**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** టీయూడబ్ల్యూజే (ఐజేయూ) వరంగల్ జిల్లా నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గురువారం బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి సంబురాలు చేశారు. ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్షులుగా రెండో సారి ఎన్నికైన శ్రీ రాం రాంచందర్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో నూతక కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షులు కుర్న వెంకటేశ్వర్లు, జన్ను స్వామి, జాయింట్ సెక్రటరీ బొమ్మగాని అశోక్, చింతనూరి రాజు, కార్యవర్గ సభ్యులు బాబర్, హుస్సేన్ పాషా, అక్రం సీనియర్ నాయకులు సంగోజు రవి, పిన్నా శివకుమార్, బుదారపు శ్రీను, బొడ్ల రవీందర్ నాద్, విజయ్ రాజ్, నయింపాషా, పెరుమాండ్ల మధుసూదన్, కందుల శ్రీధర్, దివ్వెల పూర్ణ చందర్, పారిజాతం సంతోష్, రాజేందర్, ఇస్మాయిల్, సాజిద్ పాషా, ఓంప్రకాష్, కూచన సంతోష్, గణేష్, బషీర్, జన్ను శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలువురు జర్నలిస్టుల నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేలా నూతన కమిటీ కృషి చేయాలని కోరారు.






# దేశంలోనే అతి పెద్ద సభ

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- రజతోత్సవ ఏర్పాట్ల పరిశీలన

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** భారత రాష్ట్ర సమితి పార్టీ ఏర్పడి 25 ఏండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ఈ నెల 27 న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించనున్న రజతోత్సవ సభ దేశంలోనే అతి పెద్ద సభగా రికార్డు సృష్టించనుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రజతోత్సవ మహాసభ స్థలి ఏర్పాట్లను గురువారం దయాకర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసలు ఈ పార్టీ ఎందుకోసం పుట్టింది.. ఉద్యమ సమయంలో ఎంతమంది అమరులయ్యారు.. తెలంగాణ ధ్యేయంగా రాష్ట్రాన్ని సాధించుకున్న తీరు.. ఆ తర్వాత ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ ధ్యేయంగా ముందుకు సాగిన తీరును మనము మరోసారి గుర్తు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. నాడు కేసీఆర్ పాలనలో సాగునీరు, తాగునీరు, కరెంట్ కి ఎలాంటి కష్టం లేకుండా ఉన్న ప్రజలు నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో అరిగోసలు పడుతున్న తీరు మనం చూస్తూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్.రమణ, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు ఒడితేల సతీష్ కుమార్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# నిరు పేదలకు వరం.. కళ్యాణ లక్ష్మి

◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** నిరుపేదలకు వరం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో 44మంది లబ్ధిదారులకు 44 లక్షల 5104 విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 47మంది లబ్ధిదారులకు రూ. 12 లక్షల 44500 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తూ, అర్హులైన పేదలకు న్యాయం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ పేదవారికి సంక్షేమ పథకాలు అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తున్నామని,పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సర్కార్ పని చేస్తోందని, ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోస, సన్న వడ్లకు 500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ వీర సునంద సుధాకర్ రెడ్డి, ఆత్మకూరు తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, మాజీ జడ్పీటీసీ కక్కర్ల రాధిక రాజు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తణుకుల సందీప్, గ్రామ పార్టీ అధ్యక్షులు భయ్యా కుమారస్వామి, బరుపట్ల కిరీటి, మాజీ సర్పంచ్ కంచ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకకు హాజరైన వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, వీణవంక :** మండల పరిధిలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టె రాజయ్య కుమారుడి నిశ్చితార్థ వేడుకకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ హాజరై వారిని ఆశీర్వదించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతిధులు, కార్యకర్తలు ఉన్నారు.

# వైభవోపేతంగా బండ్లు తిరుగుడు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి రామస్వామి వారి దేవాలయం చుట్టూ గురువారం సాయంత్రం శ్రీరామనవమి 9 రోజుల కార్యక్రమంలో భాగంగా బండ్లు తిరుగు కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. సీతా హనుమాన్ లక్ష్మణ భరత శత్రుఘ్న సమేతంగా శ్రీరామచంద్రస్వామి పర్యటించగా వెనుక శ్రీరామ భక్తుల ఎడ్ల బండ్లు తిరిగాయి. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు రైతులు తామ ఎద్దుల బండ్లు కట్టి స్వామి వారి నాగబెల్లి ఉత్సవానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తుల జైశ్రీరామ్ జై సీతారాం స్తోత్రాలతో శ్రీరామ భజనలతో గ్రామం మారుమోగింది. ఈ బండ్లు తిరుగు కార్యక్రమంలో గ్రామస్తులు తండోపతండాలుగా వచ్చి పాల్గొని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి వారి కృపకు పాత్రులైనారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ముసునూరి నరేష్, యాగ్నికులు పరాశర బట్టర్ అరుణాచార్య, గోవర్ధన శ్రీనివాసచార్యులు, గోవర్ధన దుర్వాస చార్యులు నిర్వహించారు.

# చలో వరంగల్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, రాబోయే రజతోత్సవ మహాసభలను పురస్కరించుకొని వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని 38వ డివిజన్‌లో ఒక విశిష్టమైన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం 38వ డివిజన్ గట్టికుప్పల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించబడగా, ముఖ్య అతిథిగా వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యుడు నన్నపునేని నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ గత 25 ఏళ్లుగా తెలంగాణ ప్రజల ఆశయాలకు అంకితమై పనిచేస్తోందని, పార్టీ సాధించిన విజయాలు ప్రతి కార్యకర్త గర్వపడేలా ఉన్నాయన్నారు. రాబోయే రజతోత్సవ మహాసభలు ప్రతిఒక్క కార్యకర్తకు పండుగలా మారాలని, ఎల్కతుర్తిలో జరిగే ఈ సభను అద్భుతంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని, సభకు హాజరయ్యే ప్రతి కార్యకర్త కోసం మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, భోజన సదుపాయాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి సభలో పాల్గొని పార్టీ ఐక్యతను చాటాలని కోరారు. అనంతరం చలో వరంగల్ వాల్ పోస్టర్ ను కార్యకర్తలు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 38వ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున గులాబీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్ బీఆర్ఎస్‌దే – గులాబీ శ్రేణులు భరోసాగా ఉండాలి అనే నినాదంతో, రాబోయే సభకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలు సంకల్పబద్ధంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో కంటెస్టెంట్ కార్పొరేటర్ తోట స్రవంతి కుమార్, ముఖ్య నాయకులు సోమేశ్వర్, సత్యం, ఆధార రమేష్, నరేష్, రాజు, నవీన్, యాకూబ్, ఎల్లయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# డివిజన్ లో కరెంట్ సమస్యలు లేకుండా చర్యలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లో తరచుగా కరెంటు నిలిచిపోవడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున స్థానికంగా నూతనంగా నాలుగు ట్రాన్స్ ఫార్మర్లను ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు ఏర్పాటు చేస్తున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. డివిజన్ లో లో వోల్టేజ్ కారణంగా ఇంటిలోని కరెంటుకు సంబంధించిన పరికరాలు పాడైపోతున్నాయని కొన్ని ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నందున డివిజన్ లోని ఉర్సు హరిజన వాడ, కరీమా బాద్ పటేల్ విగ్రహం వద్ద 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్లను తొలగించి 160 కేవీ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేశారు. డివిజన్ లో నూతనంగా వెలిసిన కాలనీలో 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్లు ఎల్లమ్మ తాళ్ల మండువ, వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ఎదురు ఏర్పాటు చేస్తారని తెలిపారు. దీంతో కొంత మేరకు కరెంటుకు అంతరాయం కలగకుండా ఉంటుందని కార్పొరేటర్ మరుపల్ల రవి పేర్కొన్నారు. కరీమా బాద్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏఈ సంపత్, లైన మెన్ కోడెం సాంబయ్యలు ఉన్నారు.

# బీజేపీ బలోపేతమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని 19వ డివిజన్ అధ్యక్షుడు మామిడాల సతీష్ అధ్యక్షతన పార్టీ బలోపేతంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కార్పొరేటర్ గందె నవీన్ గుప్తా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్ ముఖ్య అతిథిలుగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ క్రియాశీల సభ్యులను ఉద్దేశించి భారతీయ జనతాపార్టీ ఈ 45 సంవత్సరాలలో ఏ విధంగా అభివృద్ధి చెందింది వివరించారు. స్థానికంగా బీజేపీ బలోపేతం చేయడానికి పలు సూచనలు చేశారు. స్థానిక సమస్యలపై ప్రజలతో మమేకమవుతూ అధికార కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేయాలని సూచించారు. కాశిబుగ్గలోని తాగునీటి సమస్య, పలు అభివృద్ధి పనులపై, డివిజన్ సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. ఎన్నికల పరంగా, సంస్థాగతంగా బీజేపీ అభివృద్ధి, భారత రాజకీయాల్లో బీజేపీ తీసుకొచ్చిన పరివర్తన, నరేంద్ర మోదీ ప్రధానమంత్రి నేతృత్వంలో గత 10 సంవత్సరాలలో వికసిత్ భారత్ దిశగా ప్రయాణం అనే అంశాలపై సుదీర్ఘంగా ఉపన్యసించారు. 11 సంవత్సరాల పాలనలో ఎలాంటి అవినీతి కుంభకోణాలు లేకుండా పాలన చేయడం ఆర్టికల్ 370 రద్దు, ఎన్నో ఏళ్లు ఎదురుచూసిన రామ మందిరం నిర్మాణం, కొన్ని వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, నిన్న మొన్న వక్ఫ్ సవరణ చట్టం కూడా తేవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గుర్రపు సత్యనారాయణ, అల్లి అజయ్, సొల్లేటి రాఘవాచారి, ముచ్చర్ల ప్రభాకర్, శ్రీరామోజు బ్రహ్మాచారి, పల్లకొండ కోటేశ్వర్, ఆడెపు అనిల్, చింతనూరి రాము, రవితేజ, నిఖిల్, గడ్డం భాస్కర్, రాకేష్ బూత్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా గంట రవికుమార్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారి జన్మదినం సందర్భంగా జీఆర్ కే యువసేన ఆధ్వర్యంలో గంట రవికుమార్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ ద్వారా శివనగర్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మన ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద ఎంజీఎం హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయగా సుమారు 100 మంది అభిమానులు, కార్యకర్తలు, యువత రక్తదానం చేశారు. అలాగే రంగశాయిపేట గవిచర్ల క్రాస్ వద్ద గంట రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాన్ని గంట రవికుమార్ గారు ప్రారంభించారు. అదే విధంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రజల దాహార్తిని తీర్చడం కోసం పలు చలివేంద్రాలను ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ ఫౌండేషన్ ద్వారా ఏద్రైతే పేద, మధ్యతరగతి వర్గాలలో ఉన్న విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్స్ ఏర్పాటు చేయడం. పర్యావరణాన్ని కాపాడుతూ భవిష్యత్తు తరాలకు ఒక మంచి వాతావరణాన్ని కాపాడాలనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణం పై, ఎంజీఎం సమస్యలపై, వరంగల్ నగరం లో పెరుగుతున్న మతోన్మాద తీవ్రవాదంపై గంట రవికుమార్ చేస్తున్న వరుస ఉద్యమాలు వరంగల్ ప్రజల్లో అత్యంత చైతన్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఇటువంటి భావాలు, పోరాట పటిమ ఉన్న యువ నాయకుడు ఈ జిల్లాకు దొరకడం మా అదృష్టం అని ఈ సందర్భంగా జిల్లా ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున గంట రవికుమార్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని గంట రవికుమార్ ను ఆశీర్వదించారు.

# కంగ్రెస్‌కు ప్రజలే న్యూస్ పేపర్లు, టీవీ ఛానల్

➲ నీతిమాలిన పనులు చేపడుతున్న బీఆర్ఎస్
➲ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
➲ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాంచంద్రనాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రెండు న్యూస్ పేపర్లు, నాలుగు న్యూస్ ఛానల్ కొనుగోలు చేసి వాటి ద్వారా కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ అనైతిక చర్యలు చేపడుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రాంచంద్రనాయక్ అన్నారు. గురువారం డోర్నకల్ మండలంలోని తోడెళ్లగూడెం, వెన్నారం, ఉయ్యాలవాడ గ్రామాల్లో జరిగిన జై భీమ్– జై బాపూ– జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్ని పలు సీసీ రోడ్లు, మిని వైద్యశాలలు, ఐకేపీ ధాన్యం కోనుగోలు సెంటర్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా వెన్నారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 9 సంవత్సరాలు అధికారం చేపట్టి ప్రజల ఆధార అభిమానాలు పోగొట్టుకున్న బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారం చేపట్టేందుకు అనేక నీతిమాలిన పనులు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ మధ్యకాలంలో న్యూస్ పేపర్లు, టీవీ ఛానల్ కొనుగోలు చేసి వాటి ద్వారా తప్పుడు సమాచారాన్ని, ప్రచారం చేస్తుందన్నారు. సీఎం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డచెబుతూ ప్రజలకు ఎటువంటి అభివృద్ధి పనులు చేయనీవటం లేదన్నారు. వీరి నీతిమాలిన చేష్టలను ఇసడించుకుంటున్న ప్రజలు స్థానిక ఎన్నికలల్లో ఓటమిని మరోసారి రుచి చూపించాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి పేపర్ చానల్ లేదన్నారు. తెలంగాణలోని ప్రజలు కార్యకర్తలే న్యూస్ ఛానల్ పేపర్ల బాధ్యత చేపట్టి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రచారం చేసి మనలు పొందాలన్నారు. బూటకపు వాగ్ధానాలతో పదేళ్లు పాలించిన కేసీఆర్ మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల కుప్పగా చేసిన పార్టీ అధికారం చేపట్టిన సంవత్సరం కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ, సన్నబియ్యం, రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాలు, సబ్సిడీ విద్యుత్, గ్యాస్ సబ్సిడీ లాంటివి చూశామన్నారు. ఐకేపీ ద్వారా 1.50 కోట్ల రుణాలు అందించి మహిళలకు శక్తిని ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కృష్ణవేణి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎపీయం శంకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షలు జగదీష్, జిల్లా ఉపాధ్యాక్షలు బత్తుల శ్రీనివాస్, కోఆర్డినేటర్ కాలం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఖాసం శేఖర్, శెట్టి వెంకన్న, తాళ్లూరి రామయ్య, తాల్లపల్లి రాము, హనుమ, రవి, శ్రీనివాస్, హరికృష్ణ, నాని, ఫరీద్ తదితరుల పాల్గొన్నారు.

## కందగట్ల స్వప్నకు డాక్టరేట్ ప్రదానం

### పలువురి నుంచి అభినందల వెల్లువ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హైదరాబాద్ లోని చైతన్య విశ్వవిద్యాలయంలో, ఫార్మసీ విభాగంలో సూపర్ వైజర్ సృజన, కో–సూపర్ వైజర్ మామిడాల ఇస్తారి సమక్షంలో కందగట్ల స్వప్నకు డాక్టర్ అఫ్ ఫిలోసోఫీ ఇన్ ఫార్మసీ విభాగంలో యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్ వి. పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా పీహెచ్ డీ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, స్వప్న కుటుంబ సభ్యులు కందగట్ల స్వప్నకు అభినందనలు తెలిపారు. ఔషధ పరిశోధనలో స్వప్న చేసిన కృషి గ్రామీణవైద్య విధానాలకు శాస్త్రీయ బలమిచ్చే విధంగా ఉండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. సీహెచ్. సాత్విక రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రవీందర్, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ క్రిస్టోఫర్ రూబెన్, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య బోయిని రాజేందర్ రెడ్డి,, అడిషనల్ కంట్రోలర్ ఈగ జగదీష్ కుమార్, డీన్ ఆఫ్ ఫార్మసి ఆచార్య పి. శంకరయ్య, హెడ్ ఆచార్య జి. కుమారస్వామి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గోన్నారు. కందగట్ల స్వప్నకు డాక్టరేట్ రావడం చాలా సంతోషంగా ఉందని కుటుంబ సభ్యులు భర్త ముల్క రవి, మామయ్య సాంబయ్య ,అత్తమ్మ జయలక్ష్మి పిల్లలు కౌశిక్, కార్తికేయ తెలిపారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**వరంగల్ వాయిస్, దామెర :** దామెరలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి విద్యార్థులను అభినందించారు. పిల్లలు యూకేజీ పూర్తి చేసుకొని ఒకటవ తరగతి ప్రమోట్ అవుతున్న సందర్భంగా వివిధ వేషధారణలతో ఆట పాటలతో అందరిని అలరింపజేశారు. పిల్లలు వారి వారి ప్రతిభతో ఏర్పాటు చేసిన పద ప్రయోగాలు చిత్రాలు వంటివి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు చిన్నతనం నుంచే విద్య పట్ల, సమాజం పట్ల పిల్లలు మంచి అవగాహనకు వచ్చేటట్లు చేయడం ప్రదానమన్నారు. పాల బుగ్గలతో మెరిసి పోతున్న ఈ పిల్లలు రేపటి రోజున గొప్ప స్థాయికి వస్తారని వారిని తీర్చి దిద్దడంలో తల్లిదండ్రులు, ప్రైమరీ టీచర్లు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాప్ ఇంచార్జి విజయ్ కుమార్, ప్రీ ప్రైమరీ టీచర్స్ జరీనా, జోత్స్న, సుమాంజలి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



**వరంగల్ వాయిస్, గణపురం :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. గురువారం మండలంలోని వెంకటేశ్వర్ల పల్లి, ఎల్లారెడ్డిపల్లి, పరశురాంపల్లి, ధర్మారావుపేట గ్రామాల్లో జై బాబు– జై భీమ్– జై సంవిధాన్ భారత రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం భాగంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నినాదాలు చేస్తూ మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు రేపాక రాజేందర్, కార్యక్రమం మండల ఇంచార్జి పంతకాని సమ్మయ్య, సొసైటీ చైర్మన్ కే కుమార్ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్ లతో పాటు పలువురు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహావీర్ జయంతి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ చిల్డ్రన్స్ ఎంపూర్ మెంట్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ మమ్మద్ మోహినిద్దీన్ ఆదేశాల మేరకు గురువారం మహావీర్ జయంతి సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ అభిలాష్ స్టేట్ సెక్రటరీ సంపత్ హనుమకొండ డిస్టిక్ ప్రెసిడెంట్ విన్నకోట గోవర్ధన్ ఆధ్వర్యంలో పూలమాలు వేసి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్ హెచ్ఆర్ సీ అండ్ డబ్ల్యూఈఓ సభ్యులు తిరుపతి, మేఘరాజ్, వేణు, పరమేష్, రాజేష్, అమరావతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి ట్రై సైకిల్ బహూకరణ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న తూనూరి సంయుక్త అనే దివ్యాంగురాలికి, పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు అలువాల శ్రీధర్ తన చిన్ననాటి మిత్రుల సహకారంతో ట్రై సైకిల్ ను అందజేశారు. వీరు ఇదే రోజు మరో నాలుగు ట్రై సైకిళ్లను కూడా వివిధ పాఠశాలల్లోని దివ్యాంగులకు అందజేశారు.ప్రధానోపాధ్యాయురాలు బాసిరి అన్నపూర్ణ, సంయుక్త, తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సీపీని కలిసిన అటవీ, ఎక్సైజ్ అధికారులు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ జిల్లా అటవీశాఖ అధికారి అనౌజ్ అగర్వాల్, ఎక్సైజ్ విభాగం డిప్యూటీ కమిషనర్ అంజన్ రావులు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

## ప్రామాణికంగా సహకార సంఘాల పునర్విభజన చేయాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** సహకార సంఘ మార్గదర్శకాలు, ప్రామాణికంగా సహకార సంఘాల పునర్విభజన చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో సహకార సంఘాలు పునర్విభజనపై రెవెన్యూ, సహకార, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, వరంగల్, కరీంనగర్ డీసీసీబీ, డీజీఎం, ఏజీఎంలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘం మార్గదర్శకాల మేరకు 10 అంశాలను పరిగణనలోకి తీసుకుని 10 నూతన సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. సహకార సంఘాలు ఏర్పాటు ద్వారా అన్ని గ్రామాల రైతులకు ప్రయోజనం కలగాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలు సుదూరం ఉన్నందున ప్రజలకు సేవలు అందించడానికి ఇబ్బందులు వస్తున్నాయని, అట్టి ఇబ్బందులు గమనంలోకి తీసుకుని నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సహకార శాఖ అధికారి వాల్యానాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి డా.కుమారస్వామి, వ్యవసాయ శాఖ ఏడీఏ బాపు, ఉద్యాన అధికారి సునీల్, మత్స్య శాఖ అధికారి విజయ్ కుమార్, నాబార్డు డీడీఎం చైతన్య రవి, కరీంనగర్, వరంగల్ డీసీసీబీ సీఈఓలు సత్యప్రసాద్, వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



**వరంగల్ వాయిస్, నడికూడ :** పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం నడికూడ మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం లో 36 మంది కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు 36 లక్షల 4176 వేల విలువ గల చెక్కులను, 34 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.10 లక్షల 99500 వేల విలువ గల చెక్కులను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఆర్డీఓ కే నారాయణ, తహసిల్దార్ జి.నాగరాజు, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కుడ్ల మల్హాల్ రావు, సమన్వయ కమిటీ సభ్యులు పర్నెం మల్లారెడ్డి, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ మనందరిది



**జమ్మికుంట, వరంగల్ వాయిస్ :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వోడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు "జై బాపు–జై భీమ్–జై సంవిధాన్" నినాదంతో భారత రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జమ్మికుంట మండలంలోని అంకుషాపూర్, మడిపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించబడింది. ఈ పాదయాత్రను అంకుషాపూర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కడిపికొండ తిరుపతిరెడ్డి, మడిపల్లి గ్రామ అధ్యక్షుడు ఐలోని సాంబశివరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వీరంనేని పరుశురామ్ రావు మాట్లాడుతూ – "కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అవమానపరిచేలా వ్యవహరిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు బాధాకరం. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిదీ. భావితరాలకు రాజ్యాంగ ఫలాలు అందించగల ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ" అని అన్నారు. అలాగే, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గత పది సంవత్సరాలుగా దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గూడెపు సారంగపాణి, రాష్ట్ర ఫిషర్ మెన్ విభాగ కార్యదర్శి పింగిలి రాకేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గటి సదానందం, మాజీ డైరెక్టర్ మిల్కురి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు పర్లపెల్లి నాగరాజు, చెన్నవేన రమేష్, నియోజకవర్గ కార్యదర్శి ఇజ్జిగిరి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఎగ్గటి కుమారస్వామి, వాసాల రామస్వామి, అంబాల రాజు, మ్యాకమల్ల అశోక్, మాసాడి కిషన్ రావు, వడ్లూరి రాములు, జన్నే రమేష్, మంగ అశోక్, పల్లకొండ అశోక్ పాల్గొన్నారు.

# రుతుమతి అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్,కేయూ :** దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల సురక్షితమైన ఆరోగ్యం కోసమే (ఏబీవీపీ) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రుతుమతి అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. గురువారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని పద్మాక్షి హాస్టల్ లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజ ఆధ్వర్యంలో నిర్వహించిన రుతుమతి అభియాన్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా విద్యార్థి పరిషత్ రుతుమతి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలలు నెలసరి సమయంలో అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారన్నారు. ఆ సమస్యలను సరైన పద్ధతిలో ఎదుర్కొనే పరిస్థితి లేకనే అట్టడుగు వర్గాల మహిళలు అనారోగ్యాలు కోని తెచ్చుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే విద్యార్థుల నుంచి సేఫ్టీ ప్యాడ్స్ సేకరించి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలలకు అందజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించడమే కాదు దేశ వ్యాప్తంగా పేద, బడుగు, బలహీన వర్గాల మహిళల ఆరోగ్యం కోసం ఆలోచిస్తూ ఏబీవీపీ అనేక సామాజిక స్వచ్ఛందం కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అంతేకాదు నిస్వార్థంగా దేశం, ధర్మం, సమాజ హితం కోసం పని చేసే ఏకైక విద్యార్థి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ ఏబీవీపీ ఇంచార్జి నిమ్మల రాజేష్, అధ్యక్షుడు మెరుగు సాయి, నాయకులు డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, గట్టు ప్రశాంత్, సంయుక్త , సాయి ప్రియ, ఎలేంద్ర, లడ్డూ, ఫణింద్ర తదితర 100 విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సూక్ష్మంలో మోక్షం.. హోమియో వైద్యం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సూక్ష్మమైన హోమియోపతి గుళికతో అనితరసాధ్యమైన మొండి వ్యాధులు సైతం తగ్గించవచ్చునని, తను ఇంగ్లీష్ వైద్యుడిగా ఉన్నా హోమియోపతి వైద్యంపై అవగాహన ఉండటంతోనే, తన భార్య డా; ఉమా మురళి నాయక్ ను హోమియోపతి వైద్యం చదివించి డాక్టర్ ను చేశానని, మానుకోట శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ పేర్కొన్నారు. గురువారం హోమియోపతి వైద్య ప్రదాత డాక్టర్ హానీ మన్ 270 వ జయంతిని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని హోమియోపతి వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియం లో నిర్వ హించిన కార్యక్రమంలో డాక్టర్ మురళి నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హోమియోపతి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఏప్రిల్ 10 హోమియోపతి దినోత్సవాన్ని మొదలుకొని 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు జరుపుతున్నట్లు, వివిధ జిల్లాల్లో హోమియోపతి వైద్య శిబిరాలు, వైద్యం పట్ల చర్చ గోష్టులు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్య ప్రదాత డాక్టర్ సామ్యూల్ హనుమన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా పాల్గొన్న స్థానికులకు ఉచితంగా హోమియోపతి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ లతోపాటు నిర్వాహకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

## రజితోత్సవ సభను విజయవంతం చేయండి

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండలం అగ్రంపాడ్ గ్రామంలోని జి.ఆర్.ఎస్ గార్డెన్స్ లో ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ రజితోత్సవ సమావేశాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు, దామెర మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశానికి చల్లా ధర్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్ల రజతోత్సవ గులాబీ పండుగకు లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న ప్రతి గ్రామంలో ఒక పండుగలా జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించి సభకు తరలిరావాలని తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా రజితోత్సవ సభను భగ్నం చేయలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మరియు దామెర అధ్యక్షులు లేతకుల సజీవరెడ్డి, బోలోజు కుమారస్వామి, గండు రామకృష్ణ, ఎండీ జాకీర్ అలీ, బొల్లబోయిన రవి యాదవ్, సాహోరే రాజేశ్వరరావు, పొన్నం సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ రావు జ్ఞాపకార్థం చలివేంద్రం

## ప్రారంభించిన ఎస్సై శివకృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని అలియాబాద్ గ్రామంలో గురువారం మాజీ పోలీస్ అధికారి శాతరాశి సుధాకర్ రావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు శాతరాశి సనత్ కుమార్ పటేల్ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని పరకాల సబ్ ఇన్ స్పెక్టర్ శివకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సనత్ కుమార్ మాట్లాడుతూ బాటసారుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ తాజా మాజీ సర్పంచ్ శాతరాశి రమాదేవి సుధాకర్ రావు, మాజీ ఉప సర్పంచ్ ద్యాగ శ్రీనివాసరావు, యూత్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాధితుల కుటుంబాలకు పరామర్శ




**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన పుల్యాల వినోద్ నానమ్మ పుల్యాల ఓదెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను గురువారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పుల్లూరి స్వప్న సదానందం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలు పుల్యాల ఓదెమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మృతురాలి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఇల్లంతకుంట మండల కేంద్రంలో చెందిన సిరికొండ సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాయంపేట తాజా మాజీ సర్పంచ్ ఆకినపల్లి సుజాత భద్రయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, మాసాడి కిషన్ రావు, యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ సందాని, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పెద్ది కుమార్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మెన్ పోడేటి రామస్వామి పాల్గొన్నారు.

# సాయిబాబా మందిరంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకుని వైద్యుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉండవచ్చునని హనుమకొండ షిరిడి సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురువారం మందిరంలో మెడికవర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రి సిబ్బంది భక్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మందిర ధర్మకర్తలు నిర్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యి గండ్ల రమేష్, డాక్టర్ పూస సురేష్ కుమార్ లతో పాటు ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది జ్యోతి, నీలవేణి, రవి తదితరులు పాల్గొన్నారు.

# 510 జీవో సవరణ చేయాలి



**వరంగల్ వాయిస్, సంగారెడ్డి :** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ)సురేష్ కుమార్ షెట్కర్ ని కలిసిన జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ 510 జీవోను వెంటనే సవరణ చేయాలన్నారు. దానివల్ల 4 కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని, దాన్ని 510 సవరణ చేసి నాలుగు వేల ఉద్యోగులకు మేలు చేయాలని కోరారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ ఎంపీ సురేష్ ను ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ త్వరలో కేంద్రం ద్వారా వేతనాలు పెంచే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

# చలివేంద్రం ప్రారంభం

## పూర్ణ జ్యువెలర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు



**వరంగల్ వాయిస్, పరకాల:** ఏప్రిల్ 10 పరకాల పట్టణంలోని అంగడి బజార్ లో పూర్ణ జ్యువెలర్స్ బెజ్జంకి పూర్ణచారి తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరకాల శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల వాస్తవ్యులు తొమ్మిదో వార్డు మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి పూర్ణ జువెలర్స్ ఆధ్వర్యంలో అంగడి బజార్ కూరగాయల మార్కెట్ గల్లీలో సొంత ఖర్చులతో మండుటెండలో ఎండాకాలం పరకాల వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చే సదుద్దేశంతో చల్లటి నీటిని ప్రజలకు అందించాలని ప్రజలకు తన వంతు సేవ చెయ్యాలనే సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. మును ముందు మరెన్నో ప్రజా సేవా కార్యక్రమాలలో పాల్గొని ప్రజలకు తన వంతు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగబండి జ్ఞానానందం, వెనిశెట్టి శ్యామ్, పూలమాటి సదానందం, నూక సురేష్, కేశవ రెడ్డి, కానుగుల గోపి, రాజు, శివ, రమేష్, అభిలాష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బాలకృష్ణ, సూర్య ప్రకాష్, భిక్షపతి, సిద్ధు, పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పత్తి కృష్ణారెడ్డి ఇంట్లో లంచ్

## ముఖ్య అతిథిగా హాజరైన వొడితల ప్రణవ్



**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి నివాసంలో నూతనంగా ఎన్నుకోబడిన నియోజకవర్గ స్థాయి మండల అధ్యక్షులకు, టౌన్ అధ్యక్షులకు, హుజురాబాద్, జమ్మికుంట, కమలాపూర్ మార్కెట్ చైర్మన్ లకు, డైరెక్టర్లకు, ఇల్లంతకుంట దేవస్థాన పాలకవర్గ చైర్మన్, కమిటీ సభ్యులకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సరదాగా భోజనం చేస్తూ నాయకులందరితో కలిసి ముచ్చటించారు.

# పెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలం పెస్టిసైడ్స్ నూతన కమిటీ గురువారం ఎన్నికైంది. నూతన కమిటీ అధ్యక్షుడిగా నర్మేటి రవితేజ (మహేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, కామారం) ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా బలవంతుల రాజు (నీరుకుళ్ల), కోశాధికారిగా వెల్ద రాజు (ఆత్మకూరు), ఉపాధ్యక్షులుగా భైరి సూర్యప్రకాష్ ఎన్నుకోబడ్డారు. నూతనంగా ఎన్నికైన ఈ కమిటీ సభ్యులు అసోసియేషన్ లక్ష్యాల సాధన కోసం కృషి చేయనున్నారని, వారి నాయకత్వంలో సంస్థ మరింత పురోగతి సాధిస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ సంస్థ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట రేవూరి భోజనం

**వరంగల్ వాయిస్, పరకాల :** పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకొచ్చిందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల మండలం పోచారం గ్రామంలో కోడెపాక సంపత్ రాణి అనే లబ్ధిదారుల ఇంట్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రేషన్ దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా వాటిని చాలామంది లబ్ధిదారులు తినేందుకు విముఖత చూపుతూ ఇతరులకు విక్రయించేవారన్నారు. తినేందుకు సన్నబియ్యం మార్కెట్‌లో కొనుక్కుని తినేవారన్నారు. ప్రభుత్వంపై భారం పడుతున్నా పేద సామాన్య ప్రజలు కడుపునిండా తినేందుకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు సన్నబియ్యం తీసుకుని సంతోషంగా ఉన్నారని ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారన్నారని పేర్కొన్నారు. సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి పేద కుటుంబం నాణ్యమైన బియ్యాన్ని ఉచితంగా పొందేలా



ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పేద, బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భారాన్ని తగ్గించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి పేద కుటుంబం ఆకలికి గురికాకుండా, పోషక ఆహారాన్ని సమృద్ధిగా అందుకునేలా పథకం రూపొందించబడిందన్నారు. సన్న బియ్యం పంపిణీ వ్యవస్థలో ఇలాంటి అక్రమలను సహించేది లేదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



◆ **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**వరంగల్ వాయిస్, జనగామ :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయ పరిధిలో నిర్మిస్తోన్న మోడల్ హౌస్ పనులు, అలాగే స్థానిక మండలంలోని తానేదార్ పల్లి గ్రామ పంచాయతీలో జరుగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల బేస్ మెంట్ నిర్మాణం పూర్తైన పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా లబ్ధిదారులతో మాట్లాడారు. భూమి పూజ ఎప్పుడు చేశారు? మొరం ఎక్కడ నుంచి తీసుకొచ్చారు? ఏ ఇసుక ఉపయోగిస్తున్నారు? అని అడుగగా.. ఈ మేరకు 15వ తేదిన భూమి పూజ చేశామని, మొరాన్ని స్థానికంగా తీసుకొచ్చామని, గోదావరి ఇసుకను ఉపయోగిస్తున్నామని కలెక్టర్ కు లబ్ధిదారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను నేరవేరుస్తోందని పేర్కొన్నారు. మోడల్ హౌస్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అలాగే బేస్ మెంట్ కట్టడం పూర్తైన వాటికి సంబంధించి ఇంటి బేస్ మెంట్ చిత్రాలను తీసి యాప్ లో నమోదు చేయాలని, తదుపరి నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేయాలని తెలిపారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట గృహ నిర్మాణ పీడీ మాత్రు నాయక్, ఎంపీడీఓ విజయ శ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**వరంగల్ వాయిస్, దామెర :** అర్హులైన ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించే దిశగా పనిచేస్తుందని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం దామెర మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలోని సమావేశ హాల్ లో జరిగిన కార్యక్రమంలో 21మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.21 లక్షల 2436 విలువ గల చెక్కులను అందించారు. 32 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను 8 లక్షల 555 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ ఎఫ్ నిధులను కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పెండింగ్ లో ఉన్న వాటిని కూడా మంజూరు చేశామని తెలిపారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిలుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నిరుపేదలకు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రాధాన్యత క్రమంలో ఒకటి ఒకటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఎంపీడీవో గుమ్మడి కల్పన, సీఐ రంజిత్ రావు, ఎస్ఐ కొంక అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్ రెడ్డి, సీనియర్ నాయకుడు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, పోలేపాక శ్రీనివాస్, సదిరం పోచయ్య, దురిశెట్టి బిక్షపతి, మండల యూత్ అధ్యక్షుడు నల్ల సుధాకర్, దండు విజేందర్, రాస మల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలకు ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** జై భీమ్– జై బాపు– జైసంవిధాన్ భారత రాజ్యాంగం పరిరక్షణ ర్యాలీ కార్యక్రమం జమ్మికుంట మండలంలోని అంకుషాపూర్, మడిపల్లి గ్రామాలలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం, జమ్మికుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వీరంనేని పరుశురాం రావులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు ఘనంగా సన్మానించారు.

# రేషన్ షాపు తనిఖీ



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని తాడిచెర్లలో ఉన్న రేషన్ షాప్ ను గురువారం భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ అమలు తీరును పరిశీలించి షాప్ లో గల రేషన్ నిల్వలను ,రిజిస్టరు లను తనఖీ చేశారు. సన్న బియ్యం పంపిణీ లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అందేలా తగు చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్ కు సూచించారు. సన్న బియ్యం పంపిణీని స్థానిక అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి కుమార్, రెవిన్యూ ఇన్ స్పెక్టర్ రాజశేఖర్, రేషన్ షాపు డీలర్ తదితరులు పాల్గొన్నారు.









గడ్డం కేశవమూర్తి

# సేవే పరమార్థం కార్యసాధనే లక్ష్యం

- అంకితభావానికి నిలువెత్తు రూపం డాక్టర్ మజ్జి బాలకృష్ణ
- పశుసంవర్ధక శాఖలో జేడీగా రాణింపు
- అంచెలంచెలుగా ఎదిగి రైతులకు సేవలు
- సమర్థతకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు
- రిటైర్డ్ అనంతరం పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

విధి నిర్వహణలో అంకితభావం ఆయన సొంతం. క్రమశిక్షణ, కార్యదక్షతతో లక్ష్యాలు సాధించడం ఆయన నైజం. నిదానమే ప్రధానమంటూ ఆయనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో పూర్తి చేయడం ఆయన లక్ష్యం. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని భావించి అందుకు అనగుణంగా అన్నదాతలకు అండగా నిలుస్తున్న మహోన్నత వ్యక్తి ఆయన. వారే వరంగల్ జిల్లా పశు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ **డాక్టర్ మజ్జి బాలకృష్ణ.**









ఉద్యోగ పరంగా ఏ స్థాయిలో పనిచేస్తున్నా.. విధి నిర్వహణ, కర్తవ్యానికే మొదటి ప్రాధాన్యత నిస్తూ, తన లక్ష్యాన్ని సూటిగా నిర్ధారించుకుని దాని సాధనకు కార్యాచరణతో ముందుకెళ్లడంలో డాక్టర్ మజ్జి బాలకృష్ణ ఘనాపాటి. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలయ్యే పథకాలను వేగవంతం చేస్తూ, రైతు సమస్యల పరిష్కారంలో నేర్పు, ఓర్పును ప్రదర్శిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. సాధారణ స్థాయి నుంచి అసాధారణ స్థాయికి ఎదిగిన డాక్టర్ బాలకృష్ణ నిగర్వి. శాంత స్వభావి కూడా. అవగాహనే అన్నిటికి మూలమని గట్టిగా నమ్మి జీవిత కాలం దానినే ఆచరించిన వ్యక్తి ఆయన. ఓపిక, సహనం ఉంటే సమస్యలు దూరం అన్నది ఆయన నమ్మిన సిద్ధాంతం. ఉద్యోగపరంగా ఆయనది మాటల్లో చెప్పే స్వభావం కాదు. చేసి చూపించే నైజం డాక్టర్ బాలకృష్ణది.

## కుటుంబ నేపథ్యం..

నాటి విశాఖపట్నం జిల్లా నేటి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం కాడేలి గ్రామంలో మజ్జి చెల్లమ్మ–పెద్ద బొజ్జయ్య దంపతులకు 1966 ఫిబ్రవరి 25న బాలకృష్ణ జన్మించారు. వీరిది వ్యవసాయ కుంటుంబం. బాలకృష్ణకు ముగ్గురు అక్కలు, ఇద్దరు అన్నలు ఉన్నారు. 1991 మార్చి 7న ఒరిస్సాలోని పర్లాకిమిడికి చెందిన రష్మీ రాణిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వెంకట దిలీప్ కుమార్ రాజు ఏం టెక్ పూర్తి చేసి న్యూఢిల్లీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా, చిన్న కుమారుడు సాయి కృష్ణ ఇక్ ఫై బిజినెస్ స్కూల్లో ఎంబీఏ చదివి ఐసీఐసీఐలో బ్యాంక్ మేనేజర్ ఉద్యోగం సాధించారు.

## విద్యాభ్యాసం..

మజ్జి బాలకృష్ణ ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖ జిల్లా వర్తనాపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగింది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖమ్మం జిల్లా కిన్నెరసానిలోని ఏపీ గురుకుల పాఠశాలలో చదివారు. నాగార్జునసాగర్ లోని ఏపీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తి చేశారు. 1983 నుంచి 1988 వరకు తిరుపతిలోని పశు వైద్య కళాశాలలో బీవీఎస్సీ, 1996 నుంచి 1998 వరకు ఇన్ సర్వీస్ కోటాలో ఎంవీఎస్సీ కోర్సు పూర్తి చేశారు. తొలుత విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు నాన్ లోకల్ కోటాలో లభించినా వెటర్నరీ సైన్స్ పై ఉన్న మక్కువతో అందులో జాయిన్ కాలేదు. విద్యార్థి దశలో షటిల్, టేబుల్ టెన్నిస్ క్రీడలతో పాటు చిత్రలేఖనంలో ఆయన ప్రావీణ్యం సాధించారు. మూడున్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా షటిల్ ఆడుతున్నారు. అనేకసార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి బహుమతులు పొందారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో డాక్టర్ బాలకృష్ణ ముందుకు వెళ్తున్నారు.

## ఉద్యోగ ప్రస్థానం..

మజ్జి బాలకృష్ణ బీవీఎస్సీ పూర్తి కాగానే వెటర్నరీ డాక్టర్ గా ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. శ్రీకాకుళం జిల్లా బగ్గ, కొత్తూరులో 1989 ఏప్రిల్ 28 నుంచి 1991 వరకు పశు వైద్య శాస్త్ర చికిత్సకులుగా సేవలు అందించారు. రెండేళ్లు విశాఖ జిల్లా జి. మాడుగుల, మూడేళ్లు రావికమతం మండలాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఇన్ సర్వీస్ కోటలో ఎంవీఎస్సీ పూర్తి చేశారు. 1998 నుంచి 2002 వరకు విశాఖ జిల్లా రావికమతంలో, 2002 నుంచి 2005 వరకు హుకుంపేటలో వెటర్నరీ డాక్టర్ గా విధులు నిర్వర్తించారు. అదే ఏడాది అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది 2010 వరకు విజయనగరం జిల్లా సాలూరులో పనిచేశారు. 2010 నుంచి 2014 వరకు విజయనగరం సెమెన్ బ్యాంకులో డిప్యూటేషన్ పై కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014 నుంచి 2016 వరకు విజయనగరం జిల్లా గజపతినగరం వెటర్నరీ ఆసుపత్రిలో, 2016 నుంచి 2018 వరకు ఖమ్మం జిల్లా అశ్వరావుపేట పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ గా సేవలందించారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొందారు. 2018 నుంచి 2021 వరకు భూపాలపల్లి జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. అదే ఏడాది డాక్టర్ బాలకృష్ణ జాయింట్ డైరెక్టర్ గా ప్రమోషన్ పొందారు. 2021 ఫిబ్రవరి 22 నుంచి వరంగల్ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఎంతో మంది అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు.

## ఎన్నో పురస్కారాలు..

గత మూడున్నర దశాబ్దాలుగా పశుసంవర్ధక శాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న డాక్టర్ మజ్జి బాలకృష్ణ తన సర్వీసులో అనేక పురస్కారాలు.. సన్మానాలు పొందారు. 1995లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంవీవీఎస్ ప్రసాద్, 2011లో విజయనగరం కలెక్టర్ ఎం.వీరబ్రహ్మయ్య నుంచి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 2018, 2019లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్లు దుగ్యాల అమాయ్ కుమార్, వాసం వెంకటేశ్వర్లు, 2021లో కృష్ణ ఆదిత్య నుంచి జిల్లా పురస్కారాలు పొందారు. 2022లో వరంగల్ కలెక్టర్ బి.గోపి, 2023లో కలెక్టర్ ప్రావీణ్య, 2025 లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద నుంచి జిల్లా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాలు స్వీకరించారు. అలాగే ప్రముఖులతో సన్మానాలు పొందారు.

## సాగుపై దృష్టి...

పశుసంవర్ధక శాఖలోని ప్రతి ఉద్యోగి గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయడానికి ఇష్టపడాలంటారు డాక్టర్ మజ్జి బాలకృష్ణ. రూరల్ ఏరియా ప్రజలతో మమేకమై కలిసి పోవాలని, అన్నివేళలా అందరికీ అందుబాటులో ఉంటూ పేద ప్రజలకు సేవలందించడమే ధ్యేయంగా పనిచేయాలంటారాయన. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచిస్తున్నారు. 2026 జూలై 31న తాను ఉద్యోగ విరమణ పొందిన అనంతరం సమీకృత వ్యవసాయం చేస్తానంటూ ప్రకటించి తనకు వ్యవసాయంపై ఉన్న చిత్తశుద్దిని చాటుకున్నారు. తనకు వ్యవసాయ భూమితోపాటు, తోటలు, పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయని తెలిపారు. వివిధ పంటలు సాగు చేసి ఆదర్శ రైతుగా నిలుస్తానంటూ చెప్పుకొచ్చారు.





# దళారులను నమ్మి మోసపోవద్దు

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- తానేదార్ పల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, జనగామ :** ధాన్యం అమ్మకాల్లో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని తానేదార్ పల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ , చైర్మన్ లావణ్య రెడ్డిలతో కలిసి కడియం శ్రీహరి ధాన్యం కాంటా వేసి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26న నాలుగు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, అందులో భాగంగా ఈ గ్రామానికి 109 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. అర్హులందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో దొడ్డు రకం, సన్న రకం, ఎట్టి పరిస్థితుల్లోనూ కలపకూడదని, రెండింటి కళ్ళాలు వేరుగా ఉండాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కేంద్రానికి రాగానే అదే రోజున మిల్లులకు తరలించాలని సూచించారు. గత ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో 7,698 మంది రైతులకు రూ.14.39 కోట్ల సన్న బియ్యం బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే యాసంగికి కూడా రూ.500 బోనస్ ఇవ్వనుందని, సన్నాలకు రూ.2,320 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అదనంగా అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, డీఏఓ రామారావు నాయక్, డీఆర్డీఏ వసంత, డీఎం సీఎస్ హతీరాం, ఏసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, గృహ నిర్మాణ పీడీ మాత్రు నాయక్, ఎంపీడీఓ విజయ శ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీటీ సీఎస్ లు శ్రీనివాస్, దేవా, ఆర్ఐ సతీష్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..**

అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యమని దీనికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 77మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.77,08,932 విలువ గల చెక్కులను, 38మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.11.99 లక్షల విలువగల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య రెడ్డి, ఆర్డీఓ వెంకన్న, ఇతర అధికారులు, మండల నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

**హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో పలుచోట్ల ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు ప్రారంభమైన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, కొనుగోలు కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లు, తదితర అంశాల గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా విజయవంతం చేయాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- బల్దియా కమిషనర్ తో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాబ్ మేళా విజయవంతానికి వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అభిప్రాయపడ్డారు. శుక్రవారం వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధిలోని ఎంకే నాయుడు కన్వెన్షన్ హాల్ లో నిర్వహించనున్న జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి జాబ్ మేళాను విజయవంతం చేయడంపై వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాలంటీర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖమంత్రుల ప్రత్యేక అధికారి శ్రీరాములు శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం నోడల్ అధికారి రామ్ రెడ్డి, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, ఎల్డీఎం రాజు, వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# బీరన్న దేవస్థాన చైర్మన్ గా రాజుకుమార్

- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజవర్గ పరిధిలోని గురిజాల గ్రామంలో కురుమల ఇలవేల్పు బీరన్న దేవాలయంలో గురువారం ఆలయ నూతన కమిటీని ఎండోమెంట్ ఆఫీసర్ సమతా నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో శ్రీ బీరన్న దేవాలయ నూతన చైర్మన్ గా ఈరా రాజుకుమార్, డైరెక్టర్లుగా బాల్క బాబు, డేక కుమారస్వామి, అల్లి అనిల్, కారు లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి మండల కుమారస్వామి, కుల పెద్దలు కంకల ఓ నాప, అన్న రాజమల్లు, అల్లి ఐలయ్య, డేక భిక్షపతి, కురుమ సంఘ అధ్యక్షులు, కమిటీ మెంబర్స్, కురుమ కుల బొట్టు పెద్ద మనుషులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఓదెలుకు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో డాక్టరేట్ సాధించిన కుమ్మరి ఓదెలను ఘనంగా సన్మానించారు. వేలేరు తెలంగాణ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో సహ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ తెలుగు విభాగంలో డాక్టర్ పూర్ణ ప్రజ్ఞ చంద్రశేఖర రావు పర్యవేక్షణలో వరంగల్ జిల్లా కథా సాహిత్యం పరిశీలన అనే అంశంపైన పరిశోధన పూర్తి చేసినందున డాక్టరేట్ పట్టా లభించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా మొగుళ్ళపల్లి మండలం గుడిపహాడ్ అనే గ్రామానికి చెందిన కుమ్మరి చిన్న సమ్మయ్య సారమ్మ దంపతులకు జన్మించిన ఓదేలుకు చిన్నప్పుడే పోలియో సోకింది. అంగవైకల్యం తన ఉన్నత లక్ష్యం ముందు ఓడిపోయింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్ కుమార్, తోటి సిబ్బంది స్వజని, శారద, నాగజ్యోతి, నరసయ్య, శ్రీనివాస్, సందీప్, వాలి, హుస్సేన్, రాజేందర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.




# పోషకాహారం తీసుకోవాలి

**ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు**

**వరంగల్ వాయిస్, పరకాల :** మహిళలు తప్పని సరిగా పోషకవిలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు కోరారు. ఇంటింటా పోషణ సంబరాలు కార్యక్రమంలో భాగంగా గురువారం పోచారం గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబంలో అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కాబట్టి మహిళలు రక్త హీనత కలుగకుండా పోషకవిలువలు గల ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రాణి, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, మంజుల, శాంత, తల్లులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com